విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
గురువారం 22, మే 2025

మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణను వీఎంఆర్‌డిఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈసందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ బుధవారం వీఎమ్ఆర్‌డిఏ కార్యాలయంలో విశాఖ నగర అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షకు విచ్చేసిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం తో పాటు జ్ఞాపికను అందించామని, అలాగే విశాఖ నగర అభివృద్ధికి అధిక శాతం నిధులు కేటాయించి నగర అభివృద్ధికి సహకరించాలని మేయర్ మంత్రివర్యులకు విజ్ఞప్తి చేసామని తెలిపారు. ఈసందర్భంగా మంత్రి విశాఖ నగర అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని మేయర్‌కు హామీ ఇచ్చారు.

తారు రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం అనునిత్యం కృషి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన 4వ జోన్ 30వ వార్డు పరిధిలోని రెల్లి వీధిలో సుమారు 71 లక్షల రూపాయలతో కలెక్టర్ ఆఫీస్ జంక్షన్ నుండి అంబేద్కర్ కళ్యాణమండపం వరకు జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న తారు రోడ్డు పునరుద్ధరించి నిర్మాణానికి దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వార్డు కార్పొరేటర్ కోదూరు అప్పల రత్నం తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అనునిత్యం కృషి చేస్తుందని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా 30వ వార్డులో రూ.71 లక్షలు జీవీఎంసీ నిధులు వెచ్చించి తారు రోడ్డు పునరుద్ధరించి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అంచెలంచెలుగా చేపడతామని మేయర్ తెలిపారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, వార్డు సచివాలయం కార్యదర్శులు, పలువురు నాయకులు, నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కఫ్ నాయకుడు సుకుమారన్ మృతి

సీపీఐ ప్రగాఢ సంతాపం

విశాలాంధ్ర-విశాఖ : సిపిఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు, ఇస్కఫ్ జాతీయ నాయకుడు, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ టి.ఎస్. సుకుమారన్ (76) మంగళవారం రాత్రి అనారోగ్యంతో విశాఖ ఎంవీపీ కాలనీ స్వగృహంలో మరణించారు. ఆయనకు భార్య వినోలియా, కుమారులు ప్రవీణ్, ప్రదీప్ ఉన్నారు. సుకుమారన్ మృతదేహాన్ని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు సీహెచ్. రాఘవేంద్రరావు, అఖిల భారత ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు ఆచార్య కె.ఎస్. చలం, సిపిఐ, బి.ఎస్.ఎన్.ఎల్, ఇస్కఫ్, విదసం నాయకులు కె సత్యనారాయణ, సి ఎన్ క్షేత్రపాల్, డి మార్కండేయులు, బి వెంకటరావు, ఎండి బేగం, సీహెచ్ కాసుబాబు, పలువురు స్నేహితులు, శ్రేయోభిలాషులు సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా కేరళ నుండి విశాఖ వచ్చిన సుకుమారన్ పార్టీ పట్ల, సహకార ఉద్యమం పట్ల, ఇస్కఫ్ పట్ల నిబద్ధత, నిజాయితీతో పని చేసి మన్ననలు పొందిన గొప్ప నాయకుడని కొనియాడారు.

రహదారులను మెరుగుపరచడానికి కృషి

- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ
- 30వ వార్డులోని రెల్లివీధిలో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-విశాఖ సిటీ : నియోజకవర్గంలో రహదారి మెరుగుపరచడానికి కృషి చేస్తున్నాను అని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం 30 వార్డ్, రెల్లి వీధిలో 70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న తారురోడ్డుకు మేయర్ పేల శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజవర్గంలో రోడ్ల మధ్య గుంతలు లేకుండా చూడాలని అధికారులకు ఈ సందర్భంగా ఆదేశించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో గుంతలు లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. దక్షిణ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అప్పల రత్నం, కూటమి అధ్యక్షులు యజ్ఞశ్రీ, రమణ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, డిఇ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కప్పరాడలో శంకర్ ఫౌండేషన్ ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెందుర్తి : నగరంలోని కప్పరాడలో దక్షిణాసియా ఎల్పీజీ కంపెనీ సహకారంతో జీవీఎంసీ 93 వ వార్డు నాయుడు తోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సిబ్బంది బుదవారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించినట్లు ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ కమ్మెళ్ల బంగార్రాజు తెలియచేశారు. ఈ శిబిరాన్ని సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్) జి. సుబ్బ రాయుడు, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రమేష్‌కుమార్ ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ అధిపతి పి.సి.రామ్‌నానాథ్‌ఎల్. పి. జి కంపెనీ కార్యదర్శి రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈస్క్రీనింగ్ నెల రోజులకుపైగా కొనసాగుతుందని కప్పరాడ, కంచరపాలెం, పెద్ద కొత్తూరు, 47 వ వార్డులోని రాంజీ ఎస్టేట్ సహా చుట్టుపక్కల గల రోగులకు అవసరమైన కంటి సంరక్షణ సేవలను అందిస్తుందని బంగార్రాజు తెలిపారు. వైద్య పరికరాలను బలోపేతం చేయడం, ఉచిత కంటి పరీక్షా శిబిరాలను సులభతరం చేయడం నివారించదగిన అంధత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటానికి దోహదపడటం ద్వారా శంకర్ ఫౌండేషన్‌కు మద్దతు ఇవ్వడానికి దక్షిణాసియా ఎల్పీజీ కట్టుబడి ఉందని, ఎంపిక చేయబడిన రోగులను కంటి శస్త్రచికిత్సల కోసం శంకర్ ఫౌండేషన్‌కు తీసుకువస్తారని చెప్పారు. ప్రారంభం రోజున 170 మందిని పరీక్షించి, రోగులకు మందులు కళ్ళజోళ్ళు పూర్తిగా ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలియజేశారు.

శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు ప్రముఖమైనవి



విశాలాంధ్ర-మల్కాపురం : శాస్త్ర- సాంకేతిక రంగాలలో భారతదేశాన్ని అభివృద్ధి చేయడానికి మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు నిరూప మానమైనవి అని మల్కాపురం శాఖా గ్రంధాలయాధికారి వి.అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో బుధవారం ఆయన ప్రధాన వక్తగా ప్రసంగిస్తూ- యువజనుల అభివృద్ధికి, స్థానిక సంస్థల ప్రగతికి, కంప్యూటర్ రంగ పురోభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి మాట్లాడుతూ- జవహర్ రోజ్‌గార్ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేకమందికి సంవత్సరానికి కనీసం వంద రోజులు పని కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందని అన్నారు. అనంతరం బాలలంతా ప్రార్థనాగీతాలను ఆలపించారు. జాతీయ సేవా పథకం కార్యకర్తలైన సునీత మరియు జ్యోతిర్మయి బాలలకు పాటల పోటీలను నిర్వహించారు. అంతా కళాకృతులను తయారుచేయడాన్ని కొనసాగించారు. మొత్తం కార్యక్రమాలను గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ సమన్వయ పరిచారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-తగరపువలస : నేడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కె.వి. భీమిలి సబ్ స్టేషన్ మైంటెనెన్స్ పనులు నిమిత్తం మరియు 11 కేవీ పాలిటెక్నిక్ ఫీడెట్ బైఫర్కేషన్ నిమిత్తం భీమిలి, నేరెళ్లవలస, జీ.వి. అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం, తోటవీధి, అప్పికొండ వీధి, జగనన్న కాలనీ, బ్యాంక్ కాలనీ, స్మిత్ స్ట్రీట్, రేఖావనిపాలెం, ములకుద్దు, రాయపాలెం, మహా లక్ష్మీపురం, తదితర ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చేయబడును. దయచేసి వినియోగదారులు గమనించగలరు.

ఆనందపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఆనందపురం : అనందపురం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి గొరుసు నరసింగరావు (52) గణేష్ నగర్ సీతంపేట విశాఖపట్నం, భార్య రమణమ్మను తీసుకొని భీమిలి మండలం , చిప్పాడ పండగకు వెళ్లారు. భార్యను అక్కడ దింపి తిరుగు ప్రయాణంలో ఆనందపురం చెక్ పోస్ట్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుండి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్నిబలంగా ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చుకొని వెళ్లడంతో తలకు హెల్మెట్ ఉన్నప్పుడికి తీవ్రమైన గాయాలతో నర్సింగరావు అక్కడికక్కడే మృతి చెందాడు. బాడీని పోస్టుమార్టం నిమిత్తం పంపించడం జరిగిందని ఈ కేసును అనంద పురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన యోగాంధ్ర వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆశయాల మేరకు 2025 జూన్ 21వ తేదీన విశాఖ నగరం వేదికగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు యోగాంధ్ర 2025 పేరున మే 21 నుండి 2025 జూన్ 21వ తేదీ వరకు విశాఖ నగరంలో యోగా కార్యక్రమాలు జరుగనున్న నేపథ్యంలో 2025 మే 21వ తేదీ బుధవారం ఆర్కే బీచ్ సమీపంలో విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల బహిరంగ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొని ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పీజీవిఆర్ నాయుడు, మండలి శాసనసభ్యులు వేపాడ చిరంజీవిరావు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, చైర్మన్ యోగాంధ్ర 20 25 ఎమ్ ఎన్ . హరేంధిర ప్రసాద్, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాక్చి, ఇతర జిల్లా అధికారులతో కలిసి మేయర్ యోగా క్రియలను చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు.

గ్రామ రెవెన్యూ అధికారుల క్లస్టర్ విధానాన్ని మార్పు చేయాలి

మండల తహసిల్దార్ శ్యామ్ ప్రసాద్‌కు వీఆర్వోలు వినతిపత్రం

విశాలాంధ్ర-ఆనందపురం : క్లస్టర్ అనే నూతన విధానాన్ని జీవో నెంబర్ 4 విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులను క్లస్టర్ విదానంలో రేషనలైజేషన్ పేరుతో గ్రామ వార్డు సచివాలయాల సెక్రటరీ ఈనెల 18వ వ తేదీన జీవో నెంబర్ 4 విడుదల చేస్తూ కొన్ని ఉత్తర్వులు జారీ చేశారు. దానిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రస్తుతం పనిచేస్తున్న గ్రామ, వార్డు, సచివాలయాలను జనాభా ప్రాతిపదికన క్లస్టర్ విధానం తీసుకొచ్చి రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్ నిర్ణయిస్తూ, ఒక సచివాలయానికి ఒక విఆర్ ను, మరొక సచివాలయానికి సర్వేయర్ ను కేటాయిస్తూ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఈ క్లస్టర్ విధానం వల్ల సుమారు 7500 మంది మా గ్రామ రెవెన్యూ అధికారులను మిగులు సిబ్బందిగా చూపించి ఏ సచివాలయంలోను చూపించనందున మిగులు సిబ్బందిగా ఉన్న మా గ్రామ రెవెన్యూ అధికారులను ఏ శాఖలో సర్దుబాటు చేస్తారో, ఏప్రాతిపదికన మమ్మల్ని మేము పనిచేస్తున్న సచివాలయంలో చూపించకుండా సర్వేయర్ లను చూపించడానికి కారణం ఏమిటో కూడా చెప్పకుండా నిర్ణయం తీసుకోవడంవల్ల అందరూ ఆందోళన చెందుతున్నామని, మొదటి నుండి ఈరేషనలైజేషన్ ప్రక్రియలో క్లస్టర్ విధానంలో జరుగుతున్న లోపాలను మండల స్థాయి నుండి, డివిజన్ స్థాయి నుండి, జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకూ ఉన్న మన రెవిన్యూ ఉన్నతాధికారులు దృష్టికి ఇదివరకేతీసుకెళ్లడం జరిగిందనీ, అలాగే గౌరవ రెవిన్యూ మంత్రివర్యులు, గ్రామ/ వార్డు, సచివాలయాల చీఫ్ సెక్రటరీ దృష్టికి, రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీవారి, గ్రామ వార్డు సచివాలయాల ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఎవరూ కూడా మీ గ్రామ రెవెన్యూ అధికారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని చెప్పడం జరిగింది. కానీ మండల స్థాయిలో హసిల్దార్లకు, రెవిన్యూ డిపార్ట్మెంట్‌కు సంబంధం లేకుండా గ్రామ వార్డు సచివాలయాల ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల, అర్బన్‌లో మున్సిపల్ కమిషనర్లు చేసిన ఈ క్లస్టర్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని అన్ని స్థాయిలో ఉన్న అధికారులు అందచేసాము.ప్రస్తుతం ఈ క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయలను కలిపి ఒక విఆర్ఓను, రెవిన్యూ గ్రామం భూ విస్తీర్ణం ప్రాతిపదికన కాకుండా చేసిన ఈ క్లస్టర్ విధానం వల్ల 2 సచివాలయాలను కలిపి ఒక విఆర్ ఓ ను నియమించడం వల్ల ఒక ప్రక్కన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీ-సర్వే, పి.ఓ.యల్.ఆర్ రెవెన్యూ సదస్సులు గ్రామ సభలు పి.జి.ఆర్.యస్ ఇతర రోజువారీ రెవెన్యూ విధులు చేస్తూ ఒక సచివాలయానికి పని చేస్తూ అనారోగ్యాలతో ఇబ్బంది పడుతూ ఉంటే, క్లస్టర్ విదానంలో రెండు సచివాలయాలకు ఒక వి.ఆర్.ఓ ను నియమిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర ఒత్తిడితో అనారోగ్యాలు పాలై గుండెపోటులతో మరణాలు సంభవించే అవకాశాలు ఎక్కువ అవుతానీ, వెంటనే జీవో నెంబర్ 4పై ప్రభుత్వం పునరాలోచించాలని, ఒక సచివాలయానికి ఒక విఆర్ ఉండేలాగా నిర్ణయం తీసుకోవాలని, లేనియెడల 2019 ముందు వరకు ఉన్న రెవిన్యూ క్లస్టర్ విధానంలో ఒక రెవిన్యూ విలేజ్ కి ఒక విఆ0 ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, మన రెవిన్యూ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి మీ ద్వారా వెంటనే తెలియజేసి, గత ప్రభుత్వం 2019 వ సంవత్సరంలో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో, రెవిన్యూకు సంబంధం లేని, మన రెవెన్యూకు సంబంధించిన మా గ్రామ రెవెన్యూ అధికారులను గ్రామ వార్డు సచివాలయాల జీవో నెంబర్ 4 నుండి మినహాయించేలాగా చర్యలు తీసుకునేలాగా ప్రభుత్వానికి మీ ద్వారా వెంటనే నివేదిక ద్వారా తెలియజేయాలని బుధవారం ఆనందపురం మండలం తాసిల్దార్ పేర్ల శ్యామ్ ప్రసాద్‌కు ఈ సందర్భంగా వీఆర్వోలు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి. దేవరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కే.అప్పారావు, జిల్లా ట్రెజరర్ వరలక్ష్మి, మండల అధ్యక్షులు నరసింహులు, మండల గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ భద్రతా ఏర్పాట్లపై మంత్రి అనిత ఉన్నతస్థాయి సమీక్ష

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న విశాఖపట్నం బీచ్ రోడ్డులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నంకు రానున్నారు. ఈ ఉన్నత స్థాయి పర్యటనకు సన్నాహకంగా, ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖా బ్రతా బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మరియు ఇతర సీనియర్ అధికారులతో కలిసి విశాఖపట్నం బీచ్ రోడ్డు వెంబడి క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు సంబంధించిన భద్రత, లాజిస్టికల్ ఏర్పాట్లను ఆమె నిశితంగా పరిశీలించారు. యోగా దినోత్సవ వేడుకలకు సాధారణ ప్రజలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని అంచనా. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, అన్ని అధికారులు పూర్తి సమన్వయంతో, సమర్థతతో తమ విధులను నిర్వర్తించాలని, ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. భద్రతా ఏర్పాట్లలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అనిత అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి పర్యటన విజయవంతం కావడానికి అన్ని విభాగాల అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

భోగాపురం విమానాశ్రయం ఏప్రిల్‌కి పూర్తయ్యేలా చర్యలు

- 22 కనెక్టివిటీ రోడ్లు... - దసరాకి టిడ్కో ఇళ్లు
- పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడి

విశాలాంధ్ర-విశాఖ : భోగాపురం విమానాశ్రయాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తయ్యేలా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ ఆదేశించారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో బుధవారం ఉదయం ఆయన ఎం.ఎస్.ఎం.ఈ. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మేయర్ పీలా శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌లతో కలసి నగర అభివృద్ధి, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానం చేస్తూ 22 రోడ్లు ప్రతిపాదించామని, వాటిలో 15 రోడ్లు నిర్మాణంలో ఉందని తెలిపారు. మిగిలిన ఆరు రోడ్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జాతీయ రహదారి సంస్థతో సమన్వయం చేసుకుని నూతన రోడ్లు నిర్మిస్తామని స్పష్టం చేశారు. టిడ్కో ఇళ్లు 2014-2019 మధ్య 7 లక్షలు ప్రతిపాదించామని, గత ప్రభుత్వం 2 లక్షలు ఇళ్లను కూడా పూర్తి చెయ్యలేక పోయిందని చెప్పారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేయడానికి సుమారు ఏడు వేల కోట్లు కావాలని, ఎంతటి ఖర్చయినా మహిళలకు టిడ్కో ఇల్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారన్నారు. ఈ దసరాకి లబ్ధి దారులకు టిడ్కో ఇల్లు అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచి నీరు ఇచ్చేలా 2021లో అమృత పథకం కోసం కేంద్రం నిధులిస్తే, గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం వల్ల ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి మళ్ళీ నిధులు వచ్చేలా చేశారని, రూ.834 కోట్ల పనులు అమృత్ పథక కోసం నిర్దేశించామని చెప్పారు. విశాఖ మెట్రో పనులు అక్టోబర్ లో మొదలుపెడతామని స్పష్టం చేశారు. డబుల్ డెక్కర్ మెట్రో కింద డీపీఆర్ ఇచ్చామని తెలిపారు. కోటి మంది ప్రజానీకం ఉన్న హైదరాబాద్ కు రింగ్ రోడ్డు ఉంది. అదే తరహాలో విశాఖలో సెమీ రింగ్ రోడ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది లేకుండా జీవీఎంసీ వాటర్ పైప్ లైన్ పనులు పూర్తి చేయాలని, నీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలని, కొండవాలు ప్రాంతాల్లో వ్యర్థాలు తరలించే వాహనాలు, పుష్ కార్ట్ లు పెంచాలని, 2014లో పేదల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం పేదల నుండి డీడీలు కట్టించుకున్నదని మీ, వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర ప్రజలకు మౌలిక సదుపాయాలు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని మున్సిపల్ మంత్రిని శాసనసభ్యులు కోరారు. సింహాచలం స్థలాల సమస్యను, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్, బీచ్ కారిడార్, స్టీల్ ప్లాంట్ 6 లైన్స్, వీఎంఆర్డీఏ ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్, విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, వీఎమ్ఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సంపత్ కుమార్, ఏపీ ఈపీడీసీఎల్ ఎండి పృథ్వి తేజ్, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ గణబాబు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్ రాజు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, అతిథి గజపతిరావు, లోకం మాధవి, కె.లలిత కుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిప్యూటీ మేయర్ గోవిందరాజు, జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న ద్రోణి...

విశాఖలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధ గురువారాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజులపాటు కూడా ఈదురుగాలులతో కూడా వర్షాలు పడ నున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. బుధవారం ఉదయం విశాఖ నగరంలో కురవగా మళ్లీ సాయంత్రం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కోతకు గురవుతున్న హైస్కూల్ గ్రౌండ్

విశాలాంధ్ర-ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ గత వర్షాకాలంలో వర్షపు నీటి ప్రభావంతో కూలిపోయింది. అప్పటి నుంచి నేటివరకు ఆ గోడ నిర్మాణ పనులు చేపట్టక పోవడంతో తాజాగా కురిసిన తేలికపాటి వర్షానికే స్కూల్ క్రీడామైదానం మట్టి పూర్తిగా కొట్టుకుపోతూ, విద్యార్థుల ఆటల రంగాన్ని ప్రభావితం చేస్తోంది. వర్షం పడిన ప్రతిసారి మైదానంలో మట్టి కొట్టుకుపోవడంతో క్రీడా మైదానం అధ్వానంగా తయారవుతుంది. ప్రహరీ గోడ పక్కన ఉన్న బీసీ కాలనీలో క్రీడా మైదానం మట్టి రావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాస్, గంటా రవితేజ లాంటి నేతలు సమస్యను పరిశీలించి నప్పటికీ, ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ప్రస్తుతం వేసవికాలంలో చిన్నపాటి వర్షాలకే మట్టి కోతకు గురికావడం, రాబోయే వర్షాకాలంలో మరింత ప్రమాదంగా తలెత్తే అవకాశాలు ఉన్నాయని పాలకులు, అధికారులు స్పందించి, హైస్కూల్‌కు భద్రత కల్పిస్తూ ప్రహరీ గోడ నిర్మాణాన్ని తక్షణమే పనులు ప్రారంభించాలని ఉపాధ్యాయులు విద్యార్థులు కోరుతున్నారు.

సింహాద్రినాధుని దేవస్థానం ప్రధాన అర్చక-2 గుండెపోటుతో మృతి



విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకులు-2 బుధవారం ఆకస్మికంగా వైకుంఠ వసూలయ్యారు. సింహాద్రినాధుని ఆలయ ప్రధానార్చకులు (2) ఇరగవరపు రమణా చార్యులు (58) గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల కిందట ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు సింహాచలేశుని పూజా కైంకర్యాలలో విశేష సేవలందించిన రమణా చార్యులు అకాల మరణంపట్ల సింహాచలం దేవస్థానం ఉద్యోగులతోపాటు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. 98వవార్డు పద్మావతినగర్‌లో నివాసముంటున్న రమణా చార్యుల ఇంటికి వెళ్ళి ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సింహాద్రి నాథుడు కుటుంబ సభ్యులకు ధైర్యాన్నివ్వాలని పలువురు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమణాచార్యుల మరణం తీరని లోటని ఆలయ వైదిక పెద్దలు, అధికారులు నివాళులర్పించారు. సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాస్, మాజీ దర్మ కర్తలు తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అధిక ఇంధన పొదుపులో ఆర్టీసీ ఆర్ఎంకు ప్రశంసలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఏపీఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఏపీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు, రీజనల్ మేనేజర్ విశాఖపట్నం బి.అప్పలనాయుడుకి అధిక ఇంధన పొదుపు చేయడంలోనూ, అత్యుత్తమ బస్సులు నడపడం లోనూ ప్రశంసా ప్రత్రము ఇవ్వడం జరిగింది. అందులో ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంజనీరింగ్ వారు, ఎగ్జిట్ డైరెక్టర్ పరిపాలన విభాగము,అందరూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజనల్ మేనేజర్స్ పాల్గొన్న సభలో ఆయనకు ప్రశంస పత్రం ఇవ్వడం జరిగింది జరిగిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

సీపీఐ నాయకుడు అరుణ్‌కుమార్ మృతి

నేతలు సంతాపం

మృతి పార్టీకి తీరని లోటు : మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర-మధురవాడ/విశాఖ జిల్లా పాత మధురవాడ మెట్ట సిపిఐ శాఖ కార్యదర్శి కుడిపూడి అరుణ్ కుమార్ (55) బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు అనారోగ్యంతో మరణించారు. నీతీ నిజాయితీలకు మారు పేరుగా విశాఖ జిల్లా పాత మధురవాడ మెట్ట శాఖా కార్యదర్శిగా పార్టీకి సేవలందించిన కామ్రేడ్ కుమార్ మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మరుపిళ్ల పైడిరాజు పేర్కొన్నారు. కుమార్ మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మరుపిళ్ల పైడిరాజు, జి.వేళంగినిరావు తదితరులు వచ్చి మృతదేహంపై సిపిఐ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు. గురువారం ఉ.08గం.లకు అంత్యక్రియలకు తమ స్వగృహం పాత మధురవాడ నుండి బయలుదేరటం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్స్యూమర్ రిడ్రెసెల్ కమిషన్ వారి ఉత్తర్వుల మేరకు

ఎఫ్.ఎ.648/2024

1) అపోలో ఆసుపత్రి, హెల్త్‌సిటీ, చినగదిలి, విశాఖపట్నం - 530002
2) డా.వంశీకృష్ణనాథ్, అపోలో ఆసుపత్రి, హెల్త్‌సిటీ, చినగదిలి, విశాఖపట్నం - 530002

మరియు

రుత్తల అమ్మాజీ, W/o. వెంకట సత్యనారాయణ, R/o.ఫ్లాట్ 201, సాయికృష్ణ రెసిడెన్సీ, సి-1, పార్కు దగ్గర, సుజాతనగర్, విశాఖపట్నం-530051.

పై నెంబరు గల కేసు నందు మీరు ప్రతివాదిగా ఉన్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినా తీసుకోని కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్స్యూమర్ రిడ్రెసెల్ కమిషన్, విజయవాడ వారు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు తెలియచేయవలసిందిగా, కేసు ఎఫ్.ఎ-648/2024ను తేది.01-07-2025 నాటికి వాయిదా వేసి వున్నారు. కావున ఈ కేసులో ప్రతివాది అయిన రుత్తల అమ్మాజీ గారు ఆరోజు అనగా తేది. 01-07-2025న స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని, హాజరై అక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున కేసును విచారించి నిర్ణయించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

ఆర్. వివేకానంద
9866342676
రామ్ డి.అబ్దుల్ బాసిత్
అడ్వకేట్
ఇండస్ లా ఫర్మ్, # 302, 3rd ఫ్లోర్, SLV ఆర్కేడ్, P.V. రామ్‌వీధి, గాయత్రీనగర్ విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520008.
Date :21-05-2025

విద్యార్థులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-తగరపువలస : బుధవారం ఉదయం జీవీఎంసీ 1వ వార్డు పరిధిలో అంబేద్కర్ స్కూల్‌లో పదవతరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ జనసేన పార్టీ 1వ వార్డ్ అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ స్వామి ఎంఈఓ హనుమంతు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, జనసేన పార్టీ 1వ వార్డు నాయకులు పందిరి తారకేష్, వీర మహిళలు ప్రభ, స్కూల్ వైస్ ప్రెసిడెంట్ రూప పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి



విశాలాంధ్ర-పెదగంట్యాడ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాజువాక రాజీవ్ కూడలి వద్ద రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిసిసి అధికార ప్రతినిధి, ఏపీ తెలంగాణ స్టేట్ ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ జెర్రిపోతుల ముత్యాలు పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహమునకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ గారు ప్రధాన మంత్రిగా దేశ అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు యరబాల భూలోక, శనివాడ హరిబాబు, ఏం.ఎస్ వర్మ, ములకల పల్లి రాజబాబు, కోరాడ చిన్నారావు, కట్టా అప్పారావు, కొత్తపల్లి పెంటయ్య,శనివాడ హరిబాబు, డి.నానినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : మాజీ ప్రధాన మంత్రి, భారత దేశ

అభివృద్ధి ప్రదాత, రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పెందుర్తి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. బుధవారం ఉదయం పెందుర్తి కూడలిలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి వారు గజమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ సమాజానికి అందించిన సేవలను వారు ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఆడారి రమేష్ నాయుడు ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా పెందుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్క రామనాయుడు అసంఘటిత కార్మిక సంఘ అధ్యక్షుడు విన్నకోట రాము బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మోజు లక్ష్మోజి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో యాదవ సామాజిక వర్గానికి పెద్దపీట

విశాలాంధ్ర-విశాఖ సిటీ : వైసీపీలో యాదవ సామాజిక వర్గానికి మా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి రామచంద్రరావు(చందు) అన్నారు. బుధవారం వైసీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి యువజన విభాగానికి అధ్యక్షునిగా చేసిన అధినేత జగన్మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా మొల్లి అప్పారావు నియమించినందుకు మా పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డి, శాసన మండలి ప్రతి పక్ష నేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్ కన్నా బాబు, నగర అధ్యక్షులు కేకే రాజు, మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్‌కు మా తరఫున, మా యాదవ సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న నగర మేయర్ పదవిని ఒక యాదవ మహిళకి కేటాయించడం, ఉత్తరాంధ్రలో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం, క్యాబినెట్ స్థాయిలో చైర్మన్ పదవులు, బీసీ కార్పొరేషన్, ఇతర బోర్డులలో గౌరవ స్థానాలు కేటాయించడం 2020 లో స్థానిక ఎన్నికలలో మా యాదవ సామాజిక వర్గానికి 16 మందికి కార్పొరేటర్ టికెట్స్ కేటాయింపు

చేసి 13 మందిని గెలిపించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. జగనన్న మాకు ఇచ్చిన గౌరవాన్ని, చూపించిన ఆదరణను మరిచిపోలేం అన్నారు. మా ఊపిరి ఉన్నంతవరకు జిల్లాలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం, జగన్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అహర్నిశలు పనిచేస్తామన్నారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుల వంటి కీలక సమస్యలపై, పార్టీ మార్గదర్శకత్వంలో పెద్దఎత్తున పోరాట కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రత్యేకంగా కార్మికుల దీక్షకు మా పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ సమావేశం పీతల గోవింద్, పితల శ్రీనివాస్, మువ్వల సంతోష్, కొయ్య చిన్ని తదితరులు పాల్గొన్నారు.

50, 51 వార్డులలో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ నగర అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ 5వ జోన్ పరిధిలోని 50, 51 వార్డులలో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు పి.విష్ణుకుమార్ రాజు, ఆయా వార్డుల కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనునిత్యం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా 50వ వార్డు పరిధిలోని మురళి నగర్ వాకర్స్ పార్క్ అభివృద్ధి పనులకు, మాధవధార సాయిరాం నగర్ కొండం ప్రాంతాలలో జీవీఎంసీ నిధుల నుండి సుమారు రూ. 58.90 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అలాగే 51వ వార్డు భీమ్ నగర్ లో జీవీఎంసీ నిధుల నుండి సుమారు రూ. 16.20 లక్షల అంచనా వ్యయంతో సామాజిక భవన నిర్మాణానికి ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులతో కలిసి శంకుస్థాపన చేశామన్నారు. వార్డులలో ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గం పనిచేస్తుందని ప్రజలకు సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం చేపడతామని, ఉత్తర నియోజకవర్గంలోని ప్రతి వార్డుపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని శాసన సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఉప కార్యనిర్వహక ఇంజనీరు భరణి, సహాయక ఇంజనీర్లు సతీష్, రత్నాకర్, పలువురు నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షకులు పారిశుద్ధ్య కార్మికులు

95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రజల ఆరోగ్య పరిరక్షకులు పారిశుద్ధ్య కార్మికులేనని, వారు తమ ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. జీవీఎంసీ 95వ వార్డుకు సంబంధించిన 48 మంది పారిశుద్ధ్య కార్మికులకు 4 లీటర్లు కొబ్బరి నూనె, 12 సబ్బులు బుధవారం ఎన్ఎడి లే అవుట్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముమ్మన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు అందాల్సిన ప్రతి వస్తువుని సకాలంలో అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం ఒక్కొక్క పారిశుద్ధ్య కార్మికులకు 4 లీటర్లు కొబ్బరినూనె,12 సబ్బులు పంపిణీ చేశామన్నారు. ఇకపై ప్రతి సంవత్సరం పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన వస్తువులను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అందించే ఈ వస్తువులను సద్వినియోగం

చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే వార్డు పరిశుభ్రంగా ఉంటుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులు వార్డును అన్నివేళలా పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి 95,97వ వార్డు అధ్యక్షులు చిక్కాల సతీష్,కెవిఆర్.లక్ష్మి, మాధవి,మరియు శానిటేషన్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్,శానిటేషన్ సెక్రటరీలు,శానిటేషన్ సూపర్వైజర్లు,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నెక్స్ట్‌సెల్ ఇండియా డిక్సన్ టెక్నాలజీస్‌తో కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ ఎంఓయు

విశాలాంధ్ర-విశాఖపట్నం : నెక్స్ట్‌సెల్ ఇండియా భారతీయ డొమెసైల్ కంపెనీ, డిక్సన్ టెక్నాలజీస్ (ఇండియా) లిమిటెడ్ (డిక్సన్ టెక్నాలజీస్) కు చెందిన పూర్తి స్వామిత్వంలోని అనుబంధ సంస్థ అయిన ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్)తో ఒక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా, ఈ రెండు సంస్థలు ఒక కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ ఒప్పందం చేసుకున్నాయి, దీని ఉద్దేశ్యం ప్రసిద్ధ ఫ్రెంచ్ టెక్ బ్రాండ్ ఆల్కాటెల్ యొక్క స్మార్ట్‌ఫోన్‌ల తయారీకి భారత్‌లో భవిష్యత్-సిద్ధతగల ఎకోసిస్టమ్‌ను స్థాపించడం మరియు మళ్లీ లాంచ్ చేయడం.

నెక్స్ట్‌సెల్ ఇండియా మరియు ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ మధ్య ఈ భాగస్వామ్యం భారత్ అభివృద్ధి చెందుతున్న డిజిటల్ తయారీ రంగంలో ఒక కీలకమైన దశగా నిలుస్తోంది, ఇది ఆల్కాటెల్ యొక్క ఫ్రెంచ్ డిజైన్ వారసత్వాన్ని ప్యాడ్జెట్ యొక్క నిరూపితమైన తయారీ నైపుణ్యంతో కలిపి, భారతీయ వినియోగదారుల కోసం ప్రీమియం, గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే స్మార్ట్‌ఫోన్‌లను అందించడంలో సహాయపడుతుంది. ఈ భాగస్వామ్యం అధునాతన, పేటెంట్ టెక్నాలజీలను భారత్‌కు బాగుగా మార్చే అవకాశం కల్పిస్తుంది, దీని ద్వారా అత్యాధునిక డిస్ప్లే మరియు హార్డ్‌వేర్ అభివృద్ధులు స్థానిక తయారీలోకి వస్తాయి. ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ యొక్క ఆధునిక సదుపాయాల్లో ఉన్న ఈ తయారీ ఎకోసిస్టమ్ అత్యాధునిక ఆటోమేషన్, ఏఐ ఆధారిత నాణ్యత భద్రతా వ్యవస్థలు మరియు స్థిరమైన ఆపరేషనల్ పద్ధతులతో అమర్చబడి ఉంది, ఇది దేశీయ పంపిణీ మరియు గ్లోబల్ ఎగుమతుల రెండింటికీ స్కేలబుల్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టిస్తుందని ఈ భాగస్వామ్యం గురించి నెక్స్ట్‌సెల్ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంశ్ రాథీ చెప్పారు.

బూమర్ లాలిపాప్‌లను ఆవిష్కరించిన మార్స్ రిగ్లీ ఇండియా

విశాలాంధ్ర-విశాఖపట్నం : మార్స్ రిగ్లీ ఇండియా బూమర్ లాలిపాప్‌ను ఆవిష్కరించింది. ఇది భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ గమ్ బ్రాండ్‌లలో ఒకదానికి ఒక ఉత్తేజకర కొత్త మలుపును తెస్తుంది. బూమర్ తన సిగ్నేచర్ వైబ్, వినోదాన్ని 800 కోట్ల లాలిపాప్ విభాగంలోకి తీసుకువస్తోంది. ఇది తరచుగా చిన్నపిల్లలదిగా, పిల్లతనంగా భావించే ఒక విభాగాన్ని పునర్నిర్వచించడమే లక్ష్యంగా పెట్టుకుంది. 31 సంవత్సరాలకు పైగా బ్రాండ్ ఈక్విటీ మరియు నేటి యువతతో లోతైన సంబంధంతో, బూమర్ తన స్పష్టమైన వైబ్‌తో లాలిపాప్ ల్యాండ్‌స్కేప్‌ను తిరిగి రూపొందించడానికి సిద్ధంగా ఉంది. ఈ ఆవిష్కరణ మూడు ఆకర్షణీయమైన రకాల్లో రుచితో నిండిన లాలిపాప్‌ను పరిచయం చేస్తుంది: స్ట్రాబెర్రీ, ఆరెం జ్, వాటర్‌మెలన్- ప్రతి ఒక్కటి నేటి యువత శక్తివంతమైన స్ఫూర్తితో ప్రతిధ్వనించేలా రూపొందించబడింది. స్వీయ వ్యక్తీకరణ, ఆత్మవిశ్వాసంతో పాతుకుపోయిన ప్రచారంతో, బూమర్ లాలిపాప్ వ్యక్తిత్వం కోసం మరియు బెది రింపు (బుల్లీయింగ్)లకు వ్యతిరేకంగా నిలుస్తుంది. బ్రాండ్ ఛాంపియన్‌ల ప్రగతిశీల విలువలను ప్రతిధ్వనిస్తుంది. ఈ బాధ్యతకు నాయకత్వం వహిస్తున్న బ్రాండ్ ప్రచారకర్త జస్ప్రీత్ బుమ్రా ప్రశాంతమైన విశ్వాసం అనేది బూమర్ లాలిపాప్ విశ్వసించే ప్రతీ ఒక్క దాన్ని ప్రతిబింబిస్తుంది.

రేషన్ వాహనాల విషయంలో ప్రభుత్వ నిర్ణయం హర్షం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టర్ : ప్రభుత్వం వారు ఇచ్చే సరుకులను తిరిగి రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ చేసే అవకాశం కల్పించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదములు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా డీలర్స్ యూనియన్ అధ్యక్షులు. చిట్టిరాజు అన్నారు.ఆర్ కె బీచ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, విద్యాశాఖా మంత్రివర్యులు నారా లోకేష్ ఫోటోలకు పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు...కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలు కూడా ఆశిస్తున్నారని, వాహనాల వల్ల ఒకసారి తీసుకోవడం జరిగుతుందని, డీలర్ ద్వారా ఎప్పుడైనా రేషన్ తీసుకున్న అవకాశం ఉంటుందన్నారు. జైజైలు కొడుతూ, నినాదలు చెస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా యూనియన్ నాయకులకు, డీలర్లు పాల్గొన్నారు .

19 పశువుల పట్టివేత

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం నవభారత్ జంక్షన్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రెండు పశువుల వ్యాన్లను ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. నారాయణపురం సంత నుంచి అలమండ (విజయనగరం) తీసుకెళ్తున్న 19 పశు వులను పట్టుకుని రెండు వ్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ పశువులను కొత్తవలస (విజయనగరం) లోని గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్. సందీప్కుమార్ తెలిపారు.

సైక్లిస్టు గాయాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం తోటపాలెం రోడ్డులో మంగవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ సైక్లిస్ట్ గాయపడ్డాడు. తోటపాలెం గ్రామానికి చెందిన గొర్రె నాగభూషణరావు శ్రీకాకుళంలో తన పని ముగించుకుని సైకిల్పై స్వగ్రామానికి వెళ్తుండగా వెనుక ను ంచి వస్తున్న మోటారు ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ సంఘటనలో గాయపడ్డ నాగభూషణరావు ప్రస్థుతం శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగభూషణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ సీట్లకు 48,988 దరఖాస్తులు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు ఆన్లైన్ లో దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 20వ తేదీతో ముగిసిందని శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తెలి పారు. ఆయన బుధవారం తన ఛాంబర్లో మాట్లాడారు. శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్కె వ్యాలీల్లో క్యాంపస్లో పీయ మాసీ ప్రదమ సంవత్సరంలో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన 48,988 మంది దరఖాస్తు చేశారన్నారు. నాలుగు క్యాంపస్లో కలిపి మొత్తం 4,400 సీట్లు ఉన్నాయని చెప్పారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన జాబితాలను రూపొందించి వచ్చే నెల 5న జాబితాను ఆర్జీయూకేటీ అధికారులు విడుదల చేస్తారన్నారు. గతేడాది కంటే సుమారు రెండు వేల దరఖాస్తులు ఎక్కువ వచ్చాయని చెప్పారు.

కొనసాగుతున్న ఏఈఈఏపీ సెట్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈఏపీ సెట్-2025 కొనసాగుతోంది. జిల్లాలోని నాలుగు కేం ద్రాల్లో ఈ పరీక్ష జరుగుతోంది. బుధవారం రెండు షిఫ్టుల్లో కలిపి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 559కు 536 మంది. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 339కు 322 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతాయి.

యువతి అదృశ్యం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం లింగాలపేటకు చెందిన షేక్ అలీమ్ (19) అనే యువతి అదృశ్యమైనట్టు ఆమె తండ్రి షేక్ ఉమర్ స్థానిక పోలీస్ స్టేషన్కు బుధవారం ఫిర్యాదు చేశారు. పదో తరగతి వరకు చదివిన ఆమె టైలరింగ్ నేర్చుకుంటానని చెప్పి ఈ నెల 19న ఉదయం 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.